ప్రజాశక్తి
ఆదివారం 01 అక్టోబర్ 2023 5 విజయనగరం



రోగులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

రైతులు అడ్డగించినా.. ఆగని భూసేకరణ

- సొమ్మసిల్లి పడిపోయిన ఇద్దరు మహిళలు
- ఎకరాకు 52 లక్షలు చొప్పన పరిహారం కోర్టులో జమ : ఆర్‌డిఒ సూర్యకళ

రైతులను అడ్డుకుంటున్న సిఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి -భోగాపురం

విమానాశ్రయం అప్రోచ్ రోడ్డు భూ సేకరణకు సంబంధించి రెండో రోజు కూడా బైరెడ్డి పాలెం వద్ద ఉద్రిక్తత నెలకుంది. రైతులు అడ్డుపడినప్పటికీ భూముల్లోని చెట్లను తొలగించారు ఆర్‌డిఒ సూర్యకళ ఆధ్వర్యంలో శనివారం చెట్లు తొలగించేందుకు అధికారులు సిద్ధమవ్వగా రైతులు అడ్డుపడ్డారు. దీంతో భోగాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బివి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పోలీసులు రైతుల మధ్య కొంత పెనుగులాట జరిగింది. అంతేకాక జెసిబికి అడ్డంగా రైతులు బైఠాయించారు. తమ భూములు తీసుకోవద్దంటూ కొంతమంది వృద్ధులు అధికారుల ముందు కన్నీరు మున్నీరుగా విలపించారు. తమ ఖాతాలో నష్టపరిహారం వేయకుండా భూములు పైకి ఎలా వస్తారని అధికారులను రైతులు నిలదీశారు. దీంతో ఆర్‌డిఒ వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఇప్పటికే విశాఖలోని ట్రిబ్యునల్ కోర్టులో ఎకరాకు రూ.52 లక్షలు చొప్పున పరిహారాన్ని జమ చేశామని వివరించారు. ఆ పరిహారం మీ అందరికి వచ్చేలా తాము బాధ్యత తీసుంటామని తెలిపారు. పనులకు అడ్డ పడవద్దని రైతులను కోరారు. రూ.52 లక్షలు పరిహారం మాకు సరిపోదని రైతులు అన్నారు. అంతేకాక గతంలో తమకు ఎకరానికి రూ.84 లక్షలు చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడు తగ్గిస్తే ఎలాగని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చేది 52 లక్షలే తప్ప అదనపు పరిహారంతో మాకు సంబంధం లేదని ఆర్‌డిఒ తెల్చి చెప్పారు. తన ఇల్లు పోయినప్పటికీ ఎటువంటి పరిహారం అందలేదని ఒక రైతు చెప్పడంతో పరిహారంతో పాటు ప్యాకేజీ కూడా ఇప్పిస్తానని ఆర్‌డిఒ అన్నారు. ఆర్‌డిఒ సర్ది చెప్పడంతో రైతులంతా పక్కకు తప్పుకున్నారు. దీంతో భూముల్లోని చెట్లను జెసిబిలతో అధికారులు తొలగించారు. బైరెడ్డి పాలెంలో పూర్తయిన వెంటనే అధికారులు మధ్యాహ్నం నుంచి గూడెపువలస రెవెన్యూ పరిధిలోని అప్రోచ్ రోడ్డు భూముల్లో చెట్లు తొలగించారు. ఆదివారం ఎ.రావివలస భూముల్లోని చెట్లను తొలగించేందుకు సిద్ధమవుతున్నారు. ఇది పూర్తయితే అప్రోచ్ రోడ్‌కు సంబంధించిన 39 ఎకరాల భూ సేకరణ పూర్తవుతుంది. డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐలు మహేష్ బాలకృష్ణ, సర్వేయరు, ఆర్ఐ మరియు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన మహిళలను తరలిస్తున్న పోలీసులు

రైతులపై కేసు నమోదు

బైరెడ్డిపాలెంలో అప్రోచ్ రోడ్డు భూసేకరణను అడ్డుకున్న రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం చెట్లను తొలగించేందుకు వెళ్లిన అధికారుల విధులకు ఆటంకలిగించినందుకు విఆర్ఓ శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దల్లి లక్ష్మి, బైరెడ్డి ఎర్రయ్య, కనకరాజు తో పాటు మరి కొంతమంది రైతులపై కేసులు నమోదు చేశారు.

సొమ్మసిల్లి పడిపోయిన మహిళలు

అధికారులు జెసిబిలతో రావడంతో రైతులు అడ్డుపడడంతో పోలీసుల వారిని అడ్డగించే ప్రయత్నం చేశారు. దీంతో కొత్త పాపయమ్మ అనే మహిళ సొమ్మసిల్లి పడిపోయింది. వెంటనే అధికారులు పోలిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారికి సమాచారం ఇవ్వడంతో ఆయన వెంటనే చేరుకొని ఆమెకు వైద్యం చేశారు. అనంతరం ఆర్డీవో ఆ మహిళను తన వాహనంలో ఆసుపత్రికి తరలించారు. మంగళవారం రాత్రి అధికారులు చెట్లు తొలగిస్తున్న సమయంలో అడ్డుపడిన దల్లి లక్ష్మి అనే మహిళ కూడా సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో ఆమెను విజయనగరంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ చికిత్స పొందుతోంది.

జెఎఎస్ ద్వారా
ఆరోగ్య డేటా సేకరణ

విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-గరివిడి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలోని ప్రజలందరి ఆరోగ్య డేటా సేకరిస్తామని తెలిపారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా, రాష్ట్ర ప్రజలందరి ఆరోగ్య వివరాలను నమోదు చేసి, అవసరమైన వారందరికీ వైద్యం అందించడం ఈ కార్యక్రమం లక్ష్యమని చెప్పారు. గరివిడి మండలం చుక్కవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. శిబిరం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ల్యాబ్‌లో స్వయంగా సుగర్ పరీక్ష చేయించుకున్నారు. రోగులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలోని సుమారు కోటి, 63 లక్షల కుటుంబాల్లోని దాదాపు ఐదు కోట్ల మందికి చెందిన ఆరోగ్య డేటాను సేకరిస్తున్నామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వారందరికీ ఆరోగ్య, వైద్య పరీక్షలను నిర్వహించి, మందులను ఉచితంగా అందజేసి, ఇంకా మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేస్తామని తెలిపారు. నవంబరు 15 లోపల రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల్లో, అన్ని సచివాలయాల పరిధిలో శిబిరాలను నిర్వహిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు. ఎంపి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఒక ఆరోగ్య గుర్తింపు సంఖ్యను కేటాయించి, వారి వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య వివరాలను తెలుసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నా మన్నారు. హెల్త్ ప్రొఫైల్‌లో వారి వివరాలను నమోదు చేసి, అవసరమైన వారికి కేస్ షీట్లను రూపొందించినట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, నిర్ణీత సమయం కేటాయించి, వారికి వైద్యం అందిస్తామని తెలిపారు.

పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ జ్యోత్స్నతోపాటు, స్పెషలిస్టు వైద్యులు డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ త్రివేణి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ వినోద్ వర్ధన్ రెడ్డి రోగులను పరీక్షించారు. చుక్కవలస, కొండ శంభాం, బిజె పాలెం గ్రామాలకు చెందిన సుమారు వెయ్యి మందికి ఈ శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

కార్యక్రమంలో గరివిడి ఎంపిపి మీసాల విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు, ట్రెయినీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, జెడ్‌పి సిఇఒ కె.రాజ్‌కుమార్, ఆర్‌డిఒ ఎం.అప్పారావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, డిపిఒ నిర్మలాదేవి, జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర్రావు, తాహశీల్దార్ తాడ్డి గోవింద, ఎంపిడిఒ జి.భాస్కరరావు, డాక్టర్ బొత్స సందీప్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సాధించిన పతకాలతో క్రీడాకారులు

అథ్లెటిక్స్‌లో పతకాల పంట

- 40 పతకాలతో సత్తాచాటిన క్రీడాకారులు
- జాతీయ పోటీలకు 8 మంది ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21వ తేదీ నుండి 25 వరకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో జిల్లా క్రీడాకారులు 40 పతకాలు సాధించి సత్తా చాటారు. ఇందులో 12 బంగారు, 12 రజత, 16 కాంస్య పతకాలు ఉన్నాయి. ఉత్తమ ప్రతిభ కనపరిచిన ఎనిమిది మంది అథ్లెట్స్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. వీరిలో జి.లక్ష్మి, టి.లక్ష్మి, ఎం.హరీష్, ఎం.శారద, డి.ఉదయ్, బి.హరీష్, కె.సుశాంత్, బి.చాందిని ఉన్నారు. రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన వారిని, జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను కోచ్ మేనేజర్‌ను జిల్లా అథ్లెటిక్ సంఘ సభ్యులు అభినందించారు.

5 నుంచి ఫూల్‌బాగ్‌కు జిల్లా కోర్టు

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

జిల్లా కోర్టుతో పాటు, కోర్టు సముదాయంలోని ఇతర న్యాయస్థానాలను ఈనెల 5 నుంచి నగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతంలోకి మార్పు చేస్తున్నట్టు జిల్లా న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి వెల్లడించారు. ఆ రోజు నుంచి ఫూల్‌బాగ్‌లోని ఎంఆర్ పిజి బాలుర హాస్టల్ భవనంలో జిల్లా కోర్టుతోపాటు ఇతర కోర్టులన్నీ పనిచేస్తాయని జిల్లా జడ్జి తెలిపారు. విజయనగరం - చీపురుపల్లి రోడ్డులో శ్రీరస్తు ఫంక్షన్ హాలు పక్క నుంచి వున్న రోడ్డు ద్వారా తాత్కాలిక కోర్టు భవనాలకు చేరుకోవచ్చని, వ్యాసనారాయణ మెట్ట మీదుగా కూడా జిల్లా కోర్టుకు చేరుకోవచ్చని తెలిపారు. ప్రస్తుత కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరిన దృష్ట్యా ప్రస్తుత భవనాల స్థానంలో కొత్త భవనాలను నిర్మించనున్న నేపథ్యంలో జిల్లా కోర్టు, ఇతర కోర్టులను తాత్కాలిక భవనాల్లోకి మార్పు చేస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులు, ప్రజలంతా ఈ మార్పును గమనించాలని సూచించారు.

టిడిపి నాయకుల నిర్బంధం

ప్రజాశక్తి-విజయనగరంకోట, గరివిడి

చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో 'బాబుతో నేను' కార్యక్రమం తలపెట్టిన నేపథ్యంలో శనివారం వేకువ జామునుంచే టిడిపి నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. శాంతి ర్యాలీకి ముందుగా పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నప్పటికీ నిర్బంధం విధించడం అన్యాయమని టిడిపి నాయకులు అన్నారు. విజయనగరంలోని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు ఇంటి వద్ద పోలీసులు మోహరించి ఆయనను ఇంటి నుంచి బయటకు రాకుండా చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల ప్రసాద్ లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కర్రోతు నర్సింగరావు తదితరులను హౌస్ అరెస్టు చేశారు. విజయనగరం పార్లమెంటరీ అధ్యక్షులు కిమిడి నాగార్జునను చీపురుపల్లిలో గృహ నిర్బంధం చేశారు. నిరసనకు తాము అనుమతి తీసుకున్నా మని, ఇలా నిర్బంధించడం సరికాదని నాగార్జున చెప్పినప్పటికీ పోలీసులు అంగీకరించలేదు. దీంతో ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి, అక్కడే అడుగుతానని, హౌస్ అరెస్ట్ చేయటం ఏ చట్టం లో ఉందంటూ నిలదీశారు. సెక్షన్ 144, 30 అమలులో ఉన్నాయి అంటున్నందున తాను ఒక్కడినే నడుచుకుంటూ వెళ్తానని అక్కడ నుంచి పాదయాత్రగా బయల్దేరారు. కొంత దూరం వచ్చిన తర్వాత.. మార్గమధ్యలో డిఎస్‌పి చక్రవర్తి ఆయన వద్దకు చేరుకొని తన వాహనంలో ఎస్‌పి కార్యాలయానికి తీసుకెళ్తానని.. సహకరించాలని కోరారు. దీంతో జిల్లా ఎస్‌పి కార్యాలయానికి నాగార్జునను పోలీసులు తీసుకెళ్లారు. కార్యక్రమంలో సారేపాక సురేష్ బాబు, మండల చంటి, విసినిగిరి శ్రీనివాసరావు, మహంతి అప్పలనాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, మీసాల శ్రీధర్ నాయుడు, మండల అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో నాగార్జునను అడ్డుకుంటున్న పోలీసులు

11 నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 11వ తేదీ నుంచి 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి' అనే నినాదంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఇంటింటా క్యాంపెయిన్ చేపడుతున్నట్లు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. శనివారం సుజాత కన్వెన్షన్ సెంటర్లో ఆ పార్టీ విజయనగరం నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగనే ఎందుకు కావాలి అనే నినాదంతో ఇంటింటికీ వెళ్లాలన్నారు. వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పాలనను వివరిస్తూ, వారి అభిప్రాయాలు తెలుసుకోవాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులను సమన్వయం చేసుకుని వెళ్లాలన్నారు. ఆ సచివాలయ పరిధిలోనే ఒక రాత్రి నిద్ర చేయాలన్నారు. మనం చేస్తున్న పనిని క్షేత్ర స్థాయి వరకూ తీసుకు వెళ్లాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రభుత్వ సేవలను చెబుతూ.. జగన్ నాయకత్వం ఎందుకు అవసరమో వివరించాలని సూచించారు.

చంద్రబాబుపై కుట్ర ఎందుకు?

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్టు వెనుక వైసిపి కుట్ర లేదని కోలగట్ల స్పష్టం చేశారు. అమరావతి భూ కుంభకోణం వంటి కేసులు ఇంకా చాలా ఆయనపై ఉన్నాయన్నారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి-విజయనగరం

సైబరు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎస్‌పి ఆర్.గోవిందరావు సూచించారు. శనివారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో ఆయన సమావేశమయ్యారు. సోషల్ మీడియా ఉచ్చులో చిక్కుకోవద్దని విద్యార్థులను కోరారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనైతే భవిష్యత్తు అందకారమేనని అన్నారు. హద్దుల్లేని స్నేహాలు విద్యార్థినుల జీవితాలను నాశనం చేస్తున్నాయన్నారు. కావున, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని, అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. లక్ష్య సాధనకు కృషి చెయ్యాలని, తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని అన్నారు. ఇంటర్నెట్‌ను విషయ సంగ్రహణకు వినియోగించుకొని నిర్దేశించుకున్న లక్ష్యం చేరుకోవాలన్నారు. ఫేస్ బుక్, ఇన్స్ స్టాగ్రాం, ట్విట్టర్ ద్వారా పరిచయాలు అయ్యే వ్యక్తులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత ఫోటోలను అప్‌లోడ్ చేయవద్దని విద్యార్థులకు ఆర్.గోవిందరావు సూచించారు. సైబరు మోసాలకు గురైతే 1930 కు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ఐ వి.అశోక్ కుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి ఉత్సవాలు

- కళాకారులందరికీ ప్రదర్శనకు అవకాశాలు
- విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరం

అక్టోబర్ 29, 30, 31 తేదీల్లో పైడితల్లి అమ్మవారి ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ వైభవోపేతంగా నిర్వహించాలని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియం లో జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో అమ్మవారి పండగ, విజయనగరం ఉత్సవాల నిర్వహణ ఏర్పాట్ల పై సమావేశం నిర్వహించారు. సాధారణ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను చేయాలని సూచించారు. ఉత్సవ్ కమిటీ లో ఆసక్తి గల వారు కొత్తగా సభ్యులుగా చేరాలనుకునే వారు జిల్లా కలెక్టర్ ను కలసి వారి వివరాలను సమర్పించాలని తెలిపారు. కమిటీ సభ్యులు అధికారులు కలసి చర్చించుకొని జిల్లా కలెక్టర్ ఆమోదం తో వేదిక వారీగా కార్యక్రమాలను రూపొందించాలని తెలిపారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లా అధికారులను ఇన్‌ఛార్జులుగా పెడుతూ కమిటీ సభ్యులను వేస్తామన్నారు. సోమవారం మెగా మ్యూజికల్ నైట్ నిర్వహించాలని, ఆనంద గజపతి ఆడిటోరియంలో స్థానిక కళాకారుల తో ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. విఐపిల జాబితా ముందుగానే తయారు చేసుకొని వారికి కేటాయించిన సమయాల్లో దర్శనాలను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులంతా సోమవారం లోగానే దర్శనాలు పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ స్థానిక కళాకారులందరికీ అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి, మేయర్ విజయలక్ష్మి, ఎస్.పి దీపిక, జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ అనిత, సహాయ కలెక్టర్ త్రివినాగ్, దేవాలయం ఎసి, ఉత్సవ్ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సోమవారం స్పందన రద్దు

ప్రజాశక్తి-విజయనగరం

గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి. అనిత ఓ ప్రకటనలో తెలిపారు. ఫిర్యాదుదారులు గమనించాలని సూచించారు.

భూఆక్రమణలపై చర్యలు తీసుకోండి

మున్సిపల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో భూ ఆక్రమణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఒకటో వార్డు కౌన్సిలర్ చోడిగంజి రమేష్‌నాయుడు మాట్లాడుతూ బైరిసాగరం చెరువు ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందని, వెంటనే సరిహద్దులను గుర్తించాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వివరాలు కావాలని అధికారులను కోరారు. పాతబొబ్బిలిలో గ్రామకంఠం భూమి ఆక్రమించి, అమ్మేసినట్లు ఆరోపణలు వస్తున్నాయని, దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాలు అక్రమాలు, నకిలీ పట్టాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొంతమంది చేస్తున్న అక్రమాల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. కౌన్సిలర్ ఇంటి గోవిందరావు మాట్లాడుతూ ఇందిరమ్మ కాలనీలో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అక్రమాలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. గొల్లపల్లికి చెందిన వైసిపి కౌన్సిలర్ సావు శారద మాట్లాడుతూ తన వార్డుకు నిధుల కేటాయింపులో వివక్షత చూపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అన్ని వార్డులతో సమానంగా నిధులు కేటాయించాలని కోరారు. కౌన్సిల్ సమావేశంలో వచ్చిన సమస్యలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సమావేశంలో అధికారులు, కౌన్సిలర్లు, కో-అప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

నల్లకండువాలు ధరించి, ప్లకార్డులతో సమావేశానికి హాజరైన టిడిపి కౌన్సిలర్లు

బర్తరఫ్ చేసే అధికారం కౌన్సిల్‌కు ఉందా?

మున్సిపల్ కో-ఆప్షన్ పదవి నుంచి బర్తరఫ్ చేసే అధికారం కౌన్సిల్‌కు ఉందా? అని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ ప్రశ్నించారు. సెప్టెంబర్ 7న కౌన్సిల్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి బర్తరఫ్ చేయడం అన్యాయన్నారు. ఏ నిబంధనల మేరకు తనను బర్తరఫ్ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తనను బర్తరఫ్ చేస్తే కౌన్సిల్ సమావేశానికి అజెండా కాపీ ఎందుకు పంపించారని, బర్తరఫ్‌పై న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఖాన్ మాట్లాడుతుండగా సమావేశాన్ని ముగిస్తున్నట్లు చైర్మన్ మురళీకృష్ణ ప్రకటించడంతో కౌన్సిలర్లు బయటకు వెళ్లిపోయారు.

టిడిపి కౌన్సిలర్లు వాకౌట్

సమావేశానికి టిడిపి కౌన్సిలర్లు ప్లకార్డులు పట్టుకుని, నల్ల దుస్తులు, కండువాలు ధరించి హాజరయ్యారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి కౌన్సిలర్లు సమావేశాన్ని వాకౌట్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్ రాంబార్కి శరత్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసుతో చంద్రబాబుకు సంబంధం లేనప్పటికీ అన్యాయంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు.

ఇందిరమ్మ కాలనీలో అక్రమాలపై వినతులు

ఇందిరమ్మ కాలనీలో ఇళ్ల స్థలాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు, మండల కార్యదర్శి ఎస్.గోపాలం అధికారులను డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు అక్రమాలు, నకిలీ పట్టాలపై కౌన్సిల్ సమావేశంలో చర్చించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైసిపి, టిడిపి కౌన్సిలర్లకు వినతి పత్రాలు అందజేశారు.

కౌన్సిలర్‌కు వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు

నిరసనపై నిర్బంధమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం దృష్టిలో నిరసన తెలియజేయడం కూడా ఒక నేరంగా పరిణమించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగానే కాదు, కనీసం తమ మనసులో మాటను వివిధ రూపాల్లో బాహ్య ప్రపంచానికి తెలియపర్చే విధంగా వ్యవహరించడం కూడా ప్రభుత్వం దృష్టిలో శాంతిభద్రతల సమస్యగానో, ట్రాఫిక్ సమస్యగానో ప్రభుత్వం, ముఖ్యంగా మన జిల్లా పోలీస్ యంత్రాంగం చిత్రీకరిస్తోంది. గడిచిన వారంలో ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు, స్కీమ్‌వర్కర్లు, రాజకీయ నాయకులు చేపట్టిన ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు, వాటిపై పోలీసులు ప్రయోగించిన నిర్బంధాలు, భయోత్పాతం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. విద్యార్థులు తమ వసతి గృహాల్లోనూ, పాఠశాలలు, కాలేజీల్లో సమస్యలు పరిష్కరించాలంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా కనికరించలేదు. దీంతో, కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు, వారికి నాయకత్వం వహించిన ఎస్ఎఫ్ఐ నాయకులపై పోలీసులు దాష్టిక చర్యలకు ఒడిగట్టారు. విద్యార్థుల బట్టలు ఊడదీసిమరీ బలవంతంగా జీపుల్లో ఎక్కించి స్టేషన్‌లో నిర్బంధించారు. ఒకరిద్దర్ని తీవ్ర పదజాలంతో దూషిస్తూ చేయిచేసుకున్న సంఘటన కూడా విజయనగరంలో చోటు చేసుకుంది. ఇక ముందు ఇలా ఆందోళనలు చేపడితే క్రిమినల్ కేసులు పెడతామంటూ పోలీసులు బెదిరింపు చర్యలకు కూడా దిగారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ సమయంలో బెనిఫిట్స్ చెల్లించాలని, విద్యార్హతను బట్టి ప్రమోషన్లు చెల్లించాలని అంగన్‌వాడీలు, ఆయాలు ఆందోళన చేపట్టడమే నేరమైంది. ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టినందుకు విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చాలా మందిని భయభ్రాంతులకు గురిచేశారు. కొంతమందిని అరెస్టుచేశారు. ఇంకొంతమందిని ఇళ్లల్లోనే నిర్బంధించారు. కలెక్టరేట్‌కు చేరుకోకుండా అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. తమకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే పనులు చేపట్టాలని కోరిన భోగాపురం విమానాశ్రయ నిర్వాసితులపైనా

నిర్బంధాలకు వెనుకాడలేదు. అప్రోచ్‌రోడ్డు కోసం సేకరించిన 39ఎకరాలకు గాను ఇంకా పరిహారం చెల్లించకపోవడంతో నిన్నగాక మొన్న సంబంధిత రైతులు పనులు చేపట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వీరిపైనా అధికారులు నాన్ యూనిఫామ్‌లోవున్న పోలీసులను ఉసిగొల్పి తమ పనికానిచ్చేసుకున్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ బొబ్బిలి టిడిపి నాయకులు బేబీనాయన సింహాచలం వరకు తలపెట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎక్కడికక్కడ టిడిపి నాయకులపై నిర్బంధాలు ప్రయోగించారు. తాజాగా జిల్లా కేంద్రంలో ర్యాలీకి తలపెట్టిన టిడిపి నాయకులను జిల్లా వ్యాప్తంగా గృహ నిర్బంధం చేశారు. ఇలా కేవలం రైతులు, విద్యార్థులు, అంగన్‌వాడీలే కాదు. ఉద్యోగులు, కార్మికులు, రాజకీయ నాయకులపైనా ఇదే రకమైన కక్షసాధింపుతో ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఇక వామపక్షాలు, ముఖ్యంగా సిపిఎం చేస్తున్న ప్రజా ఆందోళనలపై ప్రభుత్వ వైఖరి, పోలీసుల చర్యల గురించి వేరేగా చెప్పనక్కర్లేదు. చివరకు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ సిపిఎం చేపట్టిన బైక్ యాత్రలోనూ, జిపిఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలోనూ పోలీసుల హడావుడి కనిపించింది. దీన్నిబట్టి ప్రజా, కార్మిక, పౌర, రాజకీయ ఉద్యమాలను అణిచివేయడం ద్వారా పాలన చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు, భ్రమలుపడుతున్నట్టు అర్థమౌతోంది. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేనట్టే ప్రజల్లో గూడుగట్టుకున్న అసంతృప్తి, పెల్లుబికుతున్న వ్యతిరేకతను ఆపడం ఎవరి తరమూ కాదన్న విషయం గ్రహించలేకపోతోంది. ఆ మాటకొస్తే అంగన్‌వాడీలను అరెస్టులు, నిర్బంధాలు చేసినంతమాత్రానా నిరసన సెగ ఆగలేదు. విద్యార్థుల చేపట్టిన ఆందోళనదీ అదే తీరు. సుమారు 20రోజులుగా టిడిపి నాయకులపై ఉక్కుపాదం మోపుతున్నా ఏదో ఒక రూపంలో నిరసన కార్యక్రమాలు, దీక్షలు జరుగుతునే ఉన్నాయి. అదే సమయంలో ఆయా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధ వైఖరి కూడా ప్రజలకు తెలిసిపోతునే ఉంది. గతంలో చంద్రబాబు ప్రభుత్వం కూడా ఇటువంటి నిర్బంధాలు ప్రయోగించి రాజకీయంగా నష్టపోయి ప్రతిపక్షంలోకి వెళ్లింది. ఇప్పుడు జగన్ ప్రభుత్వమూ అందుకు అతీతమేమీ కాదని పబ్లిక్ టాక్.

ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉండాలి

ప్రజాశక్తి-విజయనగరం

అంగన్వాడీ కేంద్రాల్లో బాలలకు అందిస్తున్న ఆహార పదార్థాలు పరిశుభ్రంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషన్ అభియాన్, పోషన్ మహ మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి జంక్షన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కె.ఎల్.పురం లోని కమ్యూనిటీ హాలులో జరిగిన సమావేశంలో కేసలి అప్పారావు మాట్లాడారు. పిల్లలకు క్రమం తప్పకుండా రక్త పరీక్షలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలు వలన జరిగే నష్టాలపై గ్రామాల్లో అవగాహన కలిగించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన వారికి, చిరు ధాన్యాలు వంటకాలలో గెలుపొందిన తల్లులకు, హెల్తీ బేబీ పోటీలలో గెలుపొందిన బాలలకు మిల్లెట్స్ చైన్ ప్రమోట్ చేసిన డ్వాక్రా మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి, బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ హిమ బిందు, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అండగా సిఎం సహాయ నిధి

ప్రజాశక్తి-బొబ్బిలి

సిఎం సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం సిఎం సహాయ నిధి చెక్కును పారాది గ్రామానికి చెందిన అల్లాడ కుమారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమారి వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వం సిఎం సహాయ నుంచి రూ.1.40 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొత్స రమణమ్మ, వైసిపి నాయకులు ఎం.మురళీకృష్ణ పాల్గొన్నారు.

'తైక్వాండో'లో గ్లోబల్‌వ్యూ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-రామభద్రపురం

గ్లోబల్ వ్యూ పాఠశాల విద్యార్థులు తైక్వాండో పోటీలో ప్రతిభ కనబరిచారు. గత 27న విజయనగరంలోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన అండర్-14 తైక్వాండో రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో యశ్వంత్, పావని బంగారు పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు స్కూల్ ఛైర్మన్ పి.వెంకటరమణ తెలిపారు. వీరిని ప్రిన్సిపల్ సంధ్య, కరస్పాండెంట్ మోహన్, కోచ్ సుధాకర్ అభినందనలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బిల్లలవలస విద్యార్థిని

ప్రజాశక్తి-మెరకముడిదాం

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మండలంలోని బిల్లలవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జి.సమీరా ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ, పిఇటి వివి రమణ తెలిపారు. అక్టోబరు 7 నుండి నరసారావుపేటలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలలో సమీరా పాల్గొననున్నట్లు వారు తెలిపారు. విద్యార్థిని సర్పంచ్ వర్మరాజు, హెచ్‌ఎం అభినందించారు.

విద్యుత్తు స్తంభాల తొలగింపు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని రంగపువలసలో దశాబ్దాల నుంచి పెద్దవీధిలో రోడ్డు మధ్యలో ఉన్న రెండు విద్యుత్తు స్తంభాలను ఆ శాఖ సిబ్బంది శనివారం తొలగించారు. ఎఇ జోగినాయుడు ఆధ్వర్యంలో జెసిబితో స్తంభాలను తొలగించారు. దీంతో సర్పంచ్ రాంబాబు, గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సుబ్రహ్మణ్యానికి డాక్టరేట్

ప్రజాశక్తి-భోగాపురం

అవంతి ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు బొల్లా సుబ్రహ్మణ్యం ఆంధ్రా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ సిహెచ్.శాంతి సుందరరాజు పర్యవేక్షణలో ఫజ్జీ ఐడియల్స్ అండ్ ఫిల్టర్స్ ఆఫ్ సెమిలాటీసెస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ డాక్టరేట్ లభించింది. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.వి.జి.డి.ప్రసాద్ రెడ్డి ఆయనకు డాక్టరేట్ అందజేశారు. సుబ్రహ్మణ్యాన్ని అవంతి కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్ ప్రశంసించారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సర్వే నెంబర్ 66లో ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు తొలగించాలని రామతీర్థం జంక్షన్‌కు చెందిన తుర్ల రాము శనివారం తహశీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదుచేశారు. ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లే దారిలో ప్రభుత్వ స్థలాన్ని కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి నిర్మాణాలు చేపడుతున్నారని తహశీల్దారుకు వినతి అందించారు. ప్రభుత్వ స్థలంలో ఎందుకు నిర్మాణాలు చేపడుతున్నారని అడిగితే దాడి చేసేందుకు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వికలాంగులకు క్రీడా పరికరాలు వితరణ

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక బాడంగి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో చదువుతున్న 30 మంది వికలాంగ విద్యార్థులకు 20 వేలు విలువైన క్రీడా సామగ్రిని బాగువలస చెందిన అల్లు అప్పలనాయుడు కుమారుడు, వ్యాపారవేత్త అల్లు రవికుమార్ అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులు కొల్లి ఈశ్వరరావు ద్వారా వీటిని వికలాంగులకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం దత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఎ.రామారావు, సబ్బేన సత్యనారాయణ, జి కళ్యాణి పాల్గొన్నారు.

బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలో విజయరాంపురంలో టిడిపి సీనియర్ నాయకులు నాగళ్ల సూర్యనారాయణ మాతృమూర్తి నాగళ్ల నారాయణమ్మ (65) శుక్రవారం ఆకాల మరణం చెందారు. స్థానిక నాయకుల సమాచారం మేరకు విషయం తెలుసుకున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు మాజీ ఎంపిపి వెంకటేష్, అధ్యక్షులు మడ్డిల నాయుడు, సురేష్, గ్రామ నాయకులు పాండ్రంకి సత్యం, జగదీష్, జోగారావు పాల్గొన్నారు.

ఎంపిపికి సన్మానం

ప్రజాశక్తి-తెర్లాం

ఎంపిపి ఉమాలక్ష్మి పదవి బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ, ఎంఇఒ త్రినాథరావు, తహశీల్దార్ రత్నకుమారు, వైస్ ఎంపిపి రమాదేవి. ఆమెను సన్మానించారు. శాలువాతో సత్కరించారు. ప్రజలకు మరింత సేవ చేయాలని కోరారు.

గ్రామాల్లో ఆరోగ్య సురక్ష సర్వే

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఆకులసీతంపేట, ఆతవ, సింగరాయి గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే శనివారం కొనసాగింది. ఈ సర్వేలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్.వెంకటరావు, హెచ్ఒ ఆంజనేయులు, పిహెచ్‌సి సీనియర్ అసిస్టెంట్ వెంకటరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లైవ్ స్టాక్ మిషన్ పథకంపై 3న శిక్షణ

విజయనగరం : గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా ఆర్థిక పురోగతి, సంఘటిత అభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుదల, వైవిధ్య యాజమాన్య పద్ధతుల అవలంబన తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు అక్టోబర్ 3న ప్రత్యేక శిక్షణ సదస్సు నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ జెడి డాక్టర్ ఎ.విశ్వేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. పశు సంవర్ధక శాఖ వైద్యులు, సబ్జెక్టు నిపుణులు, మార్కెటింగ్ వ్యాపారవేత్తలు తదితరులు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారని, రైతులతో నేరుగా పలు అంశాలపై మాట్లాడుతారని చెప్పారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేదిక వద్ద ఉంటుందని, శిక్షణలో భాగంగా నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ పథకం- సబ్సిడీ వివరాలు, దరఖాస్తు చేసే విధానం గురించి రైతులకు ప్రత్యేకంగా వివరిస్తారని పేర్కొన్నారు.

ప్రజల వద్దకే మరిన్ని ఆరోగ్య సేవలు

డెంకాడ.. మందులు అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

తెర్లాం.. రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రజల వద్దకే మరిన్ని ఆరోగ్య సేవలు ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. శనివారం మండలంలోని ముచ్చర్ల గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గార తవుడు, ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరణం ఆదినారాయణ, సర్పంచులు బెల్లాన త్రినాథరావు, వైద్యాధికారులు ఎం.కృష్ణారెడ్డి, అనూజ్ రాయ్, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం : కూనాయవలస గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. రోగులకు వైద్యులు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాళ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, ఎంపిడిఒ రామకృష్ణ, ఎంపిపి ఉమాలక్ష్మి, ఎఎంసి ఛైర్మన్ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి ఎస్.సత్యనారాయణ, ఐసిడిఎస్ పిఒ కె.రాజ్యలక్ష్మి, సర్పంచ్ బి.విజయబాబు, సెక్రటరీ స్వామి పాల్గొన్నారు.

కొత్తవలస : మండలంలోని ముసిరాం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రారంభించారు. ఆరోగ్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కల నాయుడు బాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు గొరపల్లి శివ, సర్పంచ్ చింతల రాములమ్మ, మాజీ సర్పంచ్ పైడినాయుడు, యాత కార్పొరేషన్ డైరెక్టర్ డి.రమణ, ఎంపిడిఒ పద్మజ పాల్గొన్నారు.

రామభద్రపురం : రామభద్రపురంలో కనిమెరకవీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. సుమారు 500 మంది ఈ శిబిరంలో వైద్య సేవలు పొందారు. ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రవికుమార్, మండల ప్రత్యేకాధికారి గోవిందరావు, ఎంపిడిఒ రమామణి పాల్గొన్నారు.

మెరకముడిదాం : పేదల ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రభుత్వం తీసుకుంటుందని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉత్తరావిల్లి సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్షను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ ఎస్‌వి రమణరాజు, వైసిపి మండల అధ్యక్షులు కోట్ల విశ్వేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాడ్డి వేణుగోపాలరావు, వైస్ ఎంపిపి తలచుట్ల హరిబాబు, నాయకులు మండల సత్యనారాయణ పాల్గొన్నారు.

డెంకాడ : రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం కాపాడటమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్య లక్ష్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలో పినతాడివాడలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 385 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, బడ్డుకొండ చిన్న, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, తహశీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఎంపిడిఒ స్వరూపారాణి, సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజయనాయుడు, మాజీ సర్పంచ్ వాళ్లే వెంకట్రావు, ఉపసర్పంచ్ రావాల అప్పలనాయుడు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : మండలంలోని గోపాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఎంపిపి సండి సోమేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు, ఎంపిటిసి గుమ్మడి సన్యాసప్పడు, రంధి వెంకట గణేష్, సీతారాంపురం సర్పంచ్ మిడతాన చిన్నంనాయుడు, తగరంపూడి రమణ, కిషోర్, ఎంపిడిఒ శేషుబాబు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. మండలంలోని కనిమెళ్లలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, ఎంపిపి మహంతి కళ్యాణి, జెడ్‌పిటిసి మహంతి సీతాలక్ష్మి, వైస్ ఎంపిపి అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాయణ రాజు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, సర్పంచ్ నడిపేన రమణ, వైద్యులు రాజేష్‌వర్మ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో సింగరాయి, ఆతవ, రామస్వామిపేట గ్రామాల్లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి డి.సత్యవంతుడు ప్రారంభించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎం.జగన్నాథం, ఎంపిడిఒ బిఎస్‌కెవిఎన్ పట్నాయక్, వైద్యాధికారులు ధరణి, రాజు, రమాదేవి, తదితరులు కన్వీనర్లు పాల్గొన్నారు.

గుర్ల : మండలంలోని పాలవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ శిబిరాన్ని డిఎంహెచ్ఒ భాస్కరరావు తనిఖీ చేశారు. ఈ శిబిరంలో 425 మందికి పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. 56 మందికి కంటి సమస్యలున్నట్లు గుర్తించారు. కార్యక్రమంలో ఎంపిపి పొట్నూరు ప్రమీల, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు, డిఎల్‌డిఎ ఛైర్మన్ బెల్లాన బంగారు నాయుడు, నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. 276 మంది వైద్య పరీక్షలు చేసుకున్నట్లు పోలిపల్లి వైద్యాధికారి తిరుపతి స్వామి తెలిపారు. ఇందులో 11 మందికి రిఫర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ఉప్పాడ అనూష, వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ బైరెడ్డి రాజు, ఎంపిడిఒ అప్పలనాయుడు, ఇఒపిఆర్‌డి సురేష్, ఎంఇఒ రమణమూర్తి, సచివాలయ కన్వీనర్లు పడాల శీను, సుందర హరీష్, గుర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష ఒక బృహత్తర కార్యక్రమమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని జొన్నవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. వివిధ స్టాళ్లను సందర్శించారు. అనంతరం జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు కెల్ల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి కర్రోతు నారాయణ, సర్పంచ్ కంది రమాదేవి, పిఎసిఎస్ ఛైర్మన్ కెల్ల త్రినాథ్, కంది గణపతి, ఎంపిడిఒ గంటా వెంకటరావు పాల్గొన్నారు. గాజులరేగ పిహెచ్‌సి వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని కోలగట్ల ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, సహాయ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్చార్జి డాక్టర్ వి ఎస్ ప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అరాచక పాలన పోవాలని
మోత మోగించారు

విజయనగరంలో బాకాలు ఊదుతూ, పల్లేలు కొడుతూ నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

వేపాడ మండలం బానాదిలో పల్లేలు కొడుతూ నిరసన తెలుపుతున్న ఎంపిటిసి తులసి, మహిళలు

ప్రజాశక్తి-బొబ్బిలి

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ.. రాష్ట్ర ప్రజలను పీడిస్తున్న సైకో జగన్ పాలన పోవాలంటూ టిడిపి ఆధ్వర్యాన శనివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా మోత మోగించారు. స్టీల్ పల్లాలను కొడుతూ, డప్పులతో శబ్దం చేస్తూ కార్యక్రమం చేపట్టారు. బొబ్బిలిలోని కోటలో నియోజకవర్గ ఇంఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా ఆధ్వర్యాన కార్యకర్తలు విజల్ వేస్తూ, పల్లాలు కొడుతూ మోత మోగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచక పాలన సాగిస్తున్నారని అన్నారు. అభివృద్ధి చేయకుండా విధ్వంసం చేస్తున్నారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ అవినీతికి చంద్రబాబుకు సంబంధం లేనప్పటికీ అక్రమంగా కేసు పెట్టి అరెస్టు చేశారన్నారు. ఎన్నికల్లో వైసిపికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలో మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచి వెంకటరావు, మత్స్యకారులు పాల్గొన్నారు. వీరికి విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు రౌతు రామమూర్తినాయుడు, టిడిపి పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, కాకల వెంకటరావు, సుంకరి సాయిరమేష్, రెడ్డి మురళీ మద్దతిచ్చారు.

విజయనగరం కోట : టిడిపి కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్‌గజపతిరాజు, జనసేన నాయకులు గురాన అయ్యలు, జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, తదితరులు పళ్లాలు కొడుతూ శబ్దం చేశారు. నెల్లిమర్లలో చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి శ్రేణులు మోత మోగిద్దాం కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ తీర్థం జంక్షన్ లో జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో పల్లాలు మోగిస్తూ శబ్దం చేశారు. నాయకులు అవ నాపు సత్యనారాయణ, కాళ్ళ రాజ శేఖర్ నల్లం శ్రీను, కోటపాటి తిరుపతి రావు, అట్టాడ శ్రీధర్, చింత పల్లి సత్య నారాయణ, తదితరులు పాల్గొన్నారు. విజయనగరం మండలం ద్వారపూడిలో బొద్దల నర్సింగరావు, విటి అగ్రహారంలో మాజీ కౌన్సిలర్ రొంగలి రామారావు ఆధ్వర్యాన కార్యక్రమం నిర్వహించారు. గజపతినగరంలో టిడిపి మండల అధ్యక్షులు ఎ.లక్ష్మునాయుడు, ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యాన భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వేపాడ మండలం బానాది గ్రామంలో ఎంపిటిసి గొంప తులసి ఆధ్వర్యాన మహిళలు పల్లేలు కొడుతూ నిరసన తెలియజేశారు. **విజయనగరం లీగల్ :** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా అశోక్‌బంగ్లా వద్ద కొనసాగుతున్న నిరసన దీక్షలో శనివారం ఆ పార్టీ లీగల్‌సెల్ నాయకులు పాల్గొన్నారు. లీగల్ సెల్ సభ్యులు కరణం సూర్యతేజ , యువి రాజేష్, అర్జి అప్పలరాజు, పివి వరలక్ష్మి, జి.రామాంజనేయులు, జి.రాంబాబు, మర్రి రవి కుమార్, కె.మల్లేశ్వర రావు, జి.మధు సూదనరావు దీక్షలో పాల్గొన్నారు. జనసేన నుంచి సనకా సుబ్రమణ్యం మద్దతు తెలిపారు.

నెల్లిమర్ల : టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు ఆధ్వర్యంలో 18వ రోజు చేపట్టిన దీక్ష శిబిరంలో కలిశెట్టి కన్నంనాయుడు, చందక శంకర్రావు, తదితరులు పాల్గొన్నారు. వీరికి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, లెంక అప్పలనాయుడు, పతివాడ తమ్మినాయుడు, గుర్రాన చక్రధర్, బొంతు వెంకటరమణ, తాడి సత్యనారాయణ, దన్నాన రామ్మూర్తి, నల్లం శ్రీను, కాళ్ల రాజశేఖర్, చందక పెంటనాయుడు, చందక చిరంజీవి మద్దతిచ్చారు. దీక్షా శిబిరానికి వెళ్లకుండా టిడిపి సీనియర్ నాయకులు సువ్వాడ రవిశేఖర్, మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావును పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, స్టేషన్‌కి తరలించారు. **డెంకాడ :** మండలంలో నాతవలసలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సంతకాల సేకరణ, రిలే నిరాహార దీక్ష కార్యక్రమాలను టిడిపి ఆధ్వర్యాన చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి పతివాడ అప్పలనారాయణ, మండల అధ్యక్షులు పల్లె భాస్కర్‌రావు, కలిదిండి పాణీరాజు, పతివాడ శివరామ విద్యాసాగర్ నాయుడు, ఎఎంసి మాజీ వైస్ ఛైర్మన్ కాగితాల సత్యనారాయణరెడ్డి, యాదవ సాధికార సమితి కన్వీనర్ కె.ఆదిబాబు, కె.రమణ, చీకటి సుహాసిని, నాతవలస సర్పంచ్ ఆవాల లక్ష్మి, ఆవాల నరేష్, అడ్డగర్ల కూర్మారావు, అడ్డగర్ల పార్వతి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నియంత ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే ఛాలెంజ్ చేయాలని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు పూసపాటి అశోక్ గజపతిరాజు అన్నారు. శనివారం భీమిలి తీరంలో ఇసుకతో ఐయామ్ విత్ సిబిఎన్ అంటూ చెక్కించిన అక్షరాల వద్ద ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. మెజిస్ట్రేట్ చెప్పిన దాన్ని చూస్తే మీరు నేరం చేయలేదు మీరు బాధపడకూడదంటూ తమ నాయకుడు చంద్రబాబుకు బోధిస్తున్నారన్నారని అన్నారు.

పనులు పరిశీలిస్తున్న గొర్లె రవికుమార్

భీమసింగి బ్రిడ్జికి మరమ్మతులు

ప్రజాశక్తి - జామి

మండలంలో భీమసింగి బ్రిడ్జి ఎట్టకేలకు మరమ్మతులకు నోచుకుంది. ఆర్అండ్‌బి అధికారులు బ్రిడ్జిపై ఏర్పడ్డ గుంతలు పూడ్చారు. జామి జెడ్‌పిటిసి సభ్యులు గొర్లె సరయు అభ్యర్థన మేరకు గుంతలు పూడుస్తున్నట్లు ఆర్అండ్‌బి సిబ్బంది తెలిపారు. ఈ పనులను వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవికుమార్ దగ్గరుండి పరిశీలించారు. వాహనదారుల అభ్యర్థన మేరకు సమస్య పరిష్కారానికి శ్రీకారం చుట్టినట్లు రవికుమార్ తెలిపారు. ఆయన వెంట బిసి సెల్ మండల అధ్యక్షులు కరక దశరథ ఉన్నారు.

పరిహారం చెల్లించాకే నిర్మాణాలు తొలగిస్తాం

ఆర్‌డిఒ శేష శైలజ

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శేష శైలజ

ప్రజాశక్తి-రామభద్రపురం

నష్ట పరిహారం చెల్లించాకే పక్కా నిర్మాణాలు తొలగిస్తామని ఆర్‌డిఒ శేషశైలజ తెలిపారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారి విస్తరణలో పక్కా ఇళ్లు, నిర్మాణాలు కోల్పోతున్న తారాపురం నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ రహదారి -26 విస్తరణ పనుల్లో భాగంగా సాలూరు బైపాస్ జంక్షన్ నుంచి దత్తిరాజేరు మండల పరిధిలోని మానాపురం రైల్వేగేట్ వరకు మూకాంబికా కన్‌స్ట్రక్షన్స్ ద్వారా చేపట్టిన పనులు 80 శాతం వరకు పూర్తయ్యాయని చెప్పారు. మధ్యలో తారాపురానికి చెందిన పక్కా ఇళ్లు, జిరాయతీ, వ్యాపార స్థలాలు ఉండడంతో ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అభ్యంతరాలుంటే తెలియపరచాలని కోరారు. సొంత స్థలంలో 60 శాతం పైబడి ఇళ్లను, జిరాయతీ స్థలాలను కోల్పోతున్న వారికి ప్రభుత్వ నిబంధనల మేరకు మూడు రెట్లు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. అనంతరం సమగ్ర భూసర్వేపై విఆర్‌ఒలతో సమీక్షించారు. రొంపల్లి, కొట్టక్కి గ్రామాల వారు వెంటనే రికార్డులను అప్పచెప్పాలని విఆర్‌ఒలను ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజారావు, తారాపురం నాయకులు బెవర సీతారాం, బెవర చిన్నారావు, కలగర్ల ప్రసాద్, గంగునాయుడు, తిరుపతిరావు పాల్గొన్నారు.

వైసిపి నూతన కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలో నూతనంగా నిర్మించిన వైసిపి కార్యాలయాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గంలోని ఎవరికి, ఎటువంటి అవసరం వచ్చినా కొత్తవలసలో తన నివాసం వద్ద, శృంగవరపుకోట పట్టణంలో పార్టీ కార్యాలయం వద్ద అందుబాటులో ఉంటానని చెప్పారు. అనంతరం పార్టీ కార్యాలయాన్ని జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షపై దృష్టిపెట్టాలని కోరారు. కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ వి.చినరామునాయుడు, నియోజకవర్గ పరిశీలకులు టి.విజయకుమార్, నాయకులు శోభా హైమావతి, బుగత వెంకటేశ్వరరావు, వాకాడ రాంబాబు, మోకాడ కుమార్, పినిశెట్టి రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ఆహారం వడ్డిస్తున్న సర్పంచ్ సత్తిబాబు

ఘనంగా లక్ష్మణరావు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని క్యాంపస్ చాలెంజ్‌లో శనివారం బొత్స లక్ష్మణరావు జన్మదిన వేడుకలను కొప్పెర్ల సర్పంచి సంకాబత్తుల సత్తిబాబు అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లక్ష్మణరావు అభిమానులు క్యాంపస్‌లో మూగ, చెముడు, అంధ విద్యార్థుల మధ్య కేక్ కట్ చేశారు. అనంతరం విధ్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. వేడుకల్లో జి.శ్రీనివాసరావు ఉన్నారు.

థెరీసా క్లబ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-విజయనగరం

కంటోన్మెంటు థెరిసా క్లబ్ ద్వారా చేస్తున్న సేవలు ప్రశంశనీయమని సమాచార పౌరసంబంధాల శాఖ ఎవి సూపరువైజరు డి.సత్యనారాయణరావు, సమాచార శాఖ ఉద్యోగి చిప్పాడ ప్రభుదాస్ కొనియడారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి వద్ద రోగుల కోసం వచ్చిన సందర్శకులకు థెరిసా క్లబ్ ప్రారంభించిన అన్నదానం కార్యక్రమంలో శనివారం పాల్గొన్నారు. ముందుగా మదర్ దెరిస్సా విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అన్నదానం కార్యక్రమాన్ని దాతల సహకారంతో విజయవంతమై కొనసాగించడం అభినందనీయమన్నారు. థెరిసా క్లబ్ సెక్రటరీ, పౌండరు కోరియాదాస్ వారి ఆధ్వర్యంలో థెరిసా క్లబ్ నిర్వహకులు, జిల్లా ప్రజా ప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంధ సేవా సంస్థలు తదితరులు సహకారంతో అన్నదానం కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. సమాచార శాఖ ఉద్యోగి సిహెచ్.ప్రభుదాస్ మాట్లాడుతూ తన 51వ పుట్టిన రోజు సందర్భంగా థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో 220 మంది రోగుల సందర్శకులకు అన్నదానం కార్యక్రమం ద్వారా ఆహారం పంపిణిలో పాలుపంచుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

విజయనగరంలో బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

5న బహిరంగ సభ జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో అక్టోబర్ 5న విశాఖపట్నం కూర్మన్నపాలెం స్టీల్ ప్లాంట్ మెయిన్ గేటు వద్ద జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం తోటపాలెం ఏరియాలో కరపత్ర ప్రచారం నిర్వహించి ముచ్చువాని చెరువుగట్టు నందు గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతోమంది త్యాగాలు, ఎన్నో పోరాటాల ద్వారా ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేసే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్ రక్షణకు జరిగే బహిరంగ సభలో ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రచారంలో సిపిఎం నాయకులు వి.లక్ష్మి, హరీష, సతీష, తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఈ నెల 5న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ కోరారు. ఈ మేరకు శనివారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రక్షణకు సిపిఎం కంకణం కట్టుకుందన్నారు. కార్యక్రమంలో వై.భాస్కరరావు, బి.రామశంకర్రావు, ఎస్.అర్జున్, జి.సన్యాసిరావు, జి.మనోజ్ కుమార్, జి.సత్యనారాయణ, జి.లావణ్య కుమార్, ఎం.కోటారావు, జి.జగమ్మ, ఆర్.చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో స్వచ్ఛతా హాయ్ సేవ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీలో శనివారం స్వచ్ఛతా హాయ్ సేవ కార్యక్రమం చేపట్టారు. స్థానిక ఆదిత్యా పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం శ్రీరామ్‌నగర్ కాలనీ, మెయిన్ రోడ్, ఆర్ఒబిపై కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నారాయణ రావు, వైస్ ఛైర్మన్ కె.వెంకటకృష్ణ, బూర సత్తిబాబు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్ పాల్గొన్నారు.

ఎంవిజిఆర్‌లో..

డెంకాడ : ఎంవిజిఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన స్వచ్ఛతా హాయ్ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. పరిశుభ్రత ప్రాధాన్యతను ఎన్ఎస్ఎస్ పిఒ ఎన్.షణ్ముఖరావు వివరించారు. విద్యార్థులకు హ్యాండ్‌వాష్, శానిటైజర్లను పంపిణీ చేశారు. తొలుత గాంధీ విగ్రహానికి నివాళ్లర్పించారు. అనంతరం చింతలవలసలో ర్యాలీ చేపట్టారు. ఎఫ్‌వైఎఫ్‌పి కన్వీనర్ కె.ఎస్.ఎన్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకుని వెళ్తామని ఆ పార్టీ నాయకులు గురాన అయ్యలు అన్నారు. ఇంటింటికి జనసేన కార్యక్రమాన్ని శనివారం స్థానిక వైఎస్ఆర్ నగర్ కాలనీలో ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి జనసేన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఆయనకు విజయ తిలకందిద్ది స్వాగతం పలికారు. తోట రమేష్ ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు సంఘీబావం తెలియజేశారు. కార్యక్రమంలో డి.రామచంద్రరాజు,విసినిగిరి శ్రీనివాసు, కాటం అశ్విని, మాతా గాయిత్రి, పితాల లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.